రైతు రుణమాఫీపై సర్వత్రా హర్షం


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కూకట్‌పల్లి: కేబినెట్ సమావేశంలో రైతు రూ.2లక్షల రుణమాఫీపై తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ సీఎం, డిప్యూటీ సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఆదివారం కేపీహెచ్‌బీ టెంపుల్ బస్‌స్టాప్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు తమ్మినేని ప్రవీణ్, రామారావు, పాడుగు అప్పారావు, ఫణీంద్ర, పిఆర్. నాయుడు, రాజేష్ గౌడ్, సాయి, వెంకటేశ్వరరావు, సంధ్య రాణి, లక్ష్మీ, అరవింద, శోభా, లత, రేణుక, శారదాలు పాల్గొన్నారు.

వైద్య వృత్తి సేవా భావంతో కొనసాగాలి

కూకట్‌పల్లి: వైద్య వృత్తి పూర్తిగా వ్యాపార ధోరణితో కాకుండా సేవా భావంతో కొనసాగాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. ఆదివారం కేపీహెచ్‌బీకాలనీ రోడ్ నం .1లో డాక్టర్ హారిక ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్కిన్వి హాస్పటల్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేరి సతీష్ రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, వైద్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన


శక్తినగర్ నుంచి ఈడబ్ల్యూఎస్ వరకు వేస్తున్న సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న తూము శ్రావణ్‌కుమార్

మూసాపేట: మూసాపేటలోని శక్తినగర్ నుంచి ఈడబ్ల్యూఎస్ వరకు వేస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానికులతో మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. ఈడబ్ల్యూఎస్‌లో వేసిన రోడ్డు వల్ల వర్షాలు పడితే నీళ్ల ఇళ్లలోకి చేరే అవకాశం ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లటంతో ఆదివారం ఆయన ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శంకుస్థాపన చేసిన పనులు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన ఆరు నెలలకు కూడా పూర్తి చేయలేకపోతున్నారని అన్నారు. పేదలు నివసించే ఈడబ్ల్యూఎస్‌లో రోడ్డును కాంట్రాక్టర్ లెవెల్ సరిచూసి వేయకపోవటంతో వర్షాలు పడినప్పుడు ఇళ్లలోకి నీరు చేరే అవకాశం ఉందని అధికారులకు ఫోన్‌లో వివరించారు. అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు ప్రసాద్‌రెడ్డి, తుకారాం, విష్ణు, చిరంజీవి, పాండురంగ రెడ్డి, శేష గిరి, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి అజయ్‌కుమార్ ముదిరాజ్


అజయ్‌కుమార్‌కు బీజేపీ కండువా కప్పుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కూకట్‌పల్లి: మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్‌వీ మాజీ జనరల్ సెక్రటరీ మర్రి అజయ్‌కుమార్ ముదిరాజ్ బీజేపీ కండువ కప్పుకున్నారు. ఆదివారం కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో ఎంపీ ఈటల రాజేందర్ అజయ్‌కుమార్‌కు పార్టీ కండువా కప్పారు. బీజేపీలో చేరిన వారిలో రామకృష్ణ, కిషోర్, నాని,దినేష్, లోకేష్, జావేద్, వంశీ, మధుమోహన్, చంద్ర, సోయల్, కిరణ్‌కుమార్ ఉన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ నాయకులు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న 8630 మంది భాషా పండితులకు పదోన్నతులు కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపామన్నారు. అనంతరం అద్వకసి బ్యాక్‌లాగ్ కారణంగా పదోన్నతులు రానటువంటి భాషా పండితులకు భవిష్యత్‌లో గ్రేడ్-2 భాషా పండితులుగా నియామకమయ్యే వారు ఎవరూ లేనందున బ్యాక్‌లాగ్ పోస్టులను సాధారణ పోస్టులుగా మార్చి పదోన్నతులు కల్పించాలని కోరామన్నారు. అదే విధంగా అప్‌గ్రేడ్‌కాని మిగిలిన 1000 గ్రేడ్ 2 భాషా పండిత పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పండిత వ్యవస్థను పూర్తి స్థాయిలో రద్దు చేయాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడె మహ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి తిరుమల, కాంతికృష్ణ, కోశాధికారి వీఎస్ఎస్‌సీ శర్మ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు హమీద్ ఖాన్ బృందం ఉన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నదని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అధ్యాపక నియామకాలు చేపట్టకుండా, నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వ వర్సిటీలను నిర్లక్ష్యం చేసి 11 ప్రైవేట్ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. 6 వేలకు పైగా ప్రభుత్వ స్కూల్స్ మూతపడ్డాయని నాడు ప్రతి పక్షనేతగా విమర్శించిన రేవంత్ రెడ్డి అధికారం చేపట్టి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రి, వీసీలను నియమించకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యజమానులు ఇష్టారాజ్యాంగా ఫీజులు, డొనేషన్లు దండుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

అందమైన మొక్కలు..
అమ్మకానికి సిద్ధం.!



● పర్యావరణ ప్రేమికులతో సందడిగా నర్సరీలు ● వర్షాకాలం రావడంతో జోరుగా పూలు, పండ్ల మొక్కల విక్రయాలు


కూకట్‌పల్లి ప్రధాన రహదారిలోని నర్సరీలో వివిధ రకాల మొక్కలు

ఆల్విన్‌కాలనీ: ఇంటి పరిసరాలను పచ్చని పూల మొక్కలు, పండ్ల మొక్కలతో ఏర్పాటు చేసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. నిన్నా మొన్నటి వరకు ఎండ వేడికి చెట్ల ఆకులన్నీ రాలిపోయి మోడుబారి, ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆకులు చిగురించి పచ్చని పందిళ్ల వలే పచ్చదనంతో నిండి ప్రశాంతతను కలిగిస్తున్నాయి. ఇటువంటి మొక్కలు ఇళ్ల ముందు నాటుకోవటానికి ప్రజలు ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివిధ కాలనీ, బస్తీలు, అపార్టుమెంట్‌లు, విల్లాలలోని ప్రజలు లక్షల రూపాయలు వెచ్చించి కొత్తకొత్త ఇళ్లను నిర్మించుకున్న వాటి అందాలను మరింత మెరుగుపర్చే విధంగా పచ్చని తోటలను పెంచుకుంటూ మరింత అందాన్ని పెంచే విధంగా ప్రకృతి సోయగాలతో కూడిన పూల మొక్కలను నాటుకుంటే ఆ ఇంటికి వచ్చే అందం మరింత మెరుగు పడుతుంది. ఈ మొక్కలను తెచ్చి ఇంటి అందాలను తీర్చిదిద్దే పనిలో ప్రజలు సమయం కేటాయిస్తున్నారు.

రకరకాల మొక్కలు...

◆ కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ముంబాయి జాతీయ రహదారి వెంట ఉన్న రామ్‌దేవ్‌రావ్ ఆసుపత్రి, ఐడీఎల్ చెరువు, వై జంక్షన్, ఎల్లమ్మ, కేపీహెచ్‌బీ ఫోరంమాల్, మలేసియా టౌన్‌షిప్ తదితరుల ప్రాంతాల్లో రకరకాల పూలమొక్కలు, పండ్ల మొక్కలు, అందమైన హైబ్రిడ్ మొక్కలను నర్సరీలలో అందుబాటులోకి తీసుకొచ్చారు.

రూ.30 నుంచి రూ.5వేల వరకు..

◆ తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలే కాక కర్ణాటక, కేరళ రాష్ట్రలే కాక ఇతర రాష్ట్రాల్లోని మొక్కలను కూడా తీసుకొచ్చి ఈ నర్సరీలలో మొక్కల ప్రేమికులకు అందుబాటులో ఉంచుతున్నారు. పారిజాతం, సంపంగి, మందారాలు, తులసి, హైబ్రీడ్ గులాబీ, కాశ్మీర్ గులాబి, కలబంద, కరివేపాకు, ఆర్కెంట, యానిటోరియం, స్నేక్, రబ్బర్ ప్లాంట్స్, అశోక మొక్కలు, డ్రాగన్, ద్రాక్ష, అరటి, ఈత, ఖర్జూర వంటి పలు రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. సుమారు 30 రూపాయల నుంచి 5 వేల రూపాయల వరకు ఈ మొక్కలను అమ్ముతున్నారు.

విక్రయాలతో సందడి...

◆ మహిళలు ఎంతో ఇష్టంగా పెంచుకునేందుకు ఈ నర్సరీల్లో సందడి చేస్తూ మొక్కలను కొనుగోలు చేస్తున్నారు. అంతేకాకుండా మొక్కలకు అవసరమైన రకరకాల అందమైన పూలకుండీలు, మొక్కలకు పోషకాలను అందించే ఎరువులు, మందులు వంటివాటిని కూడా అందుబాటులో ఉంచారు. నిర్వాహకులు మొక్కలను ఏ విధంగా పెంచాలో కూడా వివరిస్తూ చిన్న చిన్న చిట్కాలు అందిస్తున్నారు.

గిరాకీ పెరిగింది..



పూణె, మహారాష్ట్ర, రాజమండ్రిలోని కడియం లంక, విజయవాడ, వరంగల్ నుంచి వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలను తీసుకువచ్చి పర్యావరణ ప్రేమికులకు వాటిని అందిస్తున్నాం. వర్షాకాలం రావటంతో మొక్కలను కొనుగోలు చేయటానికి పలువురు ఆసక్తి చూపుతున్నారు. ధర విషయంలో ఆలోచించకుండా కొనుగోలు చేస్తున్నారు. అందమైన ఇంటిలో తీర్చిదిద్దుకునేందుకు రకరకాల మొక్కలను, కుండీలను కొనుగోలు చేస్తుండటంతో తమ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయల్లాగా విరాజిల్లుతున్నది.

– గణేష్, మొక్కల విక్రయదారుడు, కూకట్‌పల్లి

నిరుపేదలకు అండగా సీఎం సహాయ నిధి


ఎల్‌ఓసీ పత్రాలను లబ్ధిదారుడి కుటుంబీకులకు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేటకు చెందిన గుడిపూడి వెంకటరావు అత్యవసర వైద్య చికిత్సనిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాలను ఆదివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... వెంకటరావు వైద్య చికిత్సకు 1 లక్షా 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు. అనారోగ్యానికి గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా ఇస్తుందని తెలిపారు. వైద్య చికిత్సకు సహాయం అందించినందుకు ఎమ్మెల్యే గాంధీకి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

హైటెక్స్‌లో ముగిసిన 'ఇండోమ్యాక్' ఎగ్జిబిషన్

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహిస్తున్న ఇండోమ్యాక్ ఎగ్జిబిషన్ ఆదివారంతో ముగిసింది. సెలవు రోజు కావడంతో సందర్శకులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని వివిధ రకాల మిషనరీ యంత్రాలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఎగ్జిబిషన్‌లో మెషిన్‌టూల్స్, ఆటోమెషిన్, రోబోటిక్స్, వెల్డింగ్, ఎలక్ట్రికల్, ఇండస్ట్రీయల్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, సేవలు, భారీ, తేలికపాటి యంత్రాలు,యంత్ర పరికరాలు, ఉపకరణాలు, సాధనాలు, పాక్షిక సాంకేతిక పరికరాలు, ఇంజినీరింగ్ సాధనాలను ప్రదర్శించారు. స్టాల్స్ నిర్వాహకులు తమ ఉత్పత్తుల వివరాలను సందర్శకులకు వివరించారు. పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభాకర్‌గౌడ్ జన్మదిన వేడుకలు


ప్రభాకర్‌గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, అభిమానులు

మూసాపేట: ఆంజనేయనగర్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పలువురు నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తును హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబూరావు, ప్రగతినగర్ కాలనీ అధ్యక్షుడు అశోక్, శీలం రమేష్, ఎల్లేష్, జానకీ రాం, మన్మథరావు, భాస్కర్‌రావు, వెంకటేష్, కృష్ణ, రాకింగ్ స్టార్ యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నీట్ దీర్ఘకాలిక శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నేడు చివరి రోజు

రాయదుర్గం: 2024–25 విద్యా సంవత్సరానికి నీట్‌లో అర్హత సాధించేందుకు దీర్ఘకాలిక శిక్షణ పొందేందుకు అర్హత కలిగిన విద్యార్థుల నుంచి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ దరఖాస్తులను కోరుతోందని గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల/ పాఠశాల ప్రిన్సిపాల్ ఏ. శారద ఆదివారం తెలిపారు. నగరంలోని టీజీఎస్‌ఆర్‌సీ సీఓఈ గౌలిదొడ్డి, నార్సింగి, చిల్కూర్, మహేంద్రహిల్స్ గురుకులాల్లో నీట్ కోసం లాంగ్ టర్మ్ శిక్షణ ఇస్తారని తెలిపారు. అర్హులైన షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకుపైన తెలిపిన విద్యాలయాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించి నీట్-2024 పరీక్ష రాసిన విద్యార్థులకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు గురుకులాల సొసైటీ వెబ్‌సైట్ ద్వారా రూ.200 చెల్లించి ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆర్ట్ గ్యాలరీలో వాటర్ కలర్ వర్క్‌షాప్

మాదాపూర్: మహిళా చిత్రకళాకారులు వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్‌గ్యాలరీలో ఉమెన్ ఆర్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆధివారం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 46 మంది మహిళా చిత్ర కళాకారులకు వాటర్‌కలర్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. అనంతరం కళాకారులుకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

'పాట్నా హైకోర్టు తీర్పుతో బీసీలకు నష్టం'

ఉస్మానియా యూనివర్సిటీ: సామాజిక రిజర్వేషన్లు రద్దు చేస్తూ పాట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పుతో బీసీలకు నష్టమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్లకు అనుకూలమైన తీర్పు ఇచ్చిన కోర్టులు బడుగుల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడం తగదన్నారు. ఎలాంటి గణంకాలు లేకుండా కమిషన్ సిఫార్సులు లేకుండా 10 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమన్నారు. బీహార్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించేలా పాట్నా కోర్టును పునఃసమీక్షించాలని కోరారు.

విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్‌పై హర్షం

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరాపై ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి ఆదివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలకు ఉచిత విద్యుత్ ఇవ్వడం వల్ల పేద విద్యార్థులు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. రెండేళ్ల క్రితమే ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ కోరినట్లు ఆయన గుర్తు చేశారు. అయితే కోతలు లేకుండా నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయాలని ఆయన కోరారు.

ఒలింపిక్‌లో రాణించాలి : కొండా విజయ్

గచ్చిబౌలి: త్వరలో జరగబోయే ఒలింపిక్‌లో భారత క్రీడాకారులు రాణించాలని హాకీ తెలంగాణ అధ్యక్షులు కొండా విజయ్ పేర్కొన్నారు. ఆదివారం గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఒలింపిక్ ధినోత్సవం సందర్భంగా రన్ నిర్వహించారు. కొద్ది రోజుల్లో ప్యారీస్‌లో జరగనున్న ఒలింపిక్‌లో హాకీతో ఇతర క్రీడల్లో భారత క్రీడాకారులు రాణించాలని ఆయన ఆకాంక్షించారు. గతంలో ఒలంపిక్‌లో మంచి ప్రతిభ కన బర్చారని ఈసారి కూడా సత్తా చాటాలన్నారు. ఈ సందర్భంగా హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో హాకీ తెలంగాణ సెక్రటరీ భీంసింగ్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల హాకీ సెక్రటరీలు వేణు, భాస్కర్, కోచ్‌లు జ్యో తి, సోనీ పాల్గొన్నారు.

ఒకే జెండా, ఒకే రాజ్యాంగం ఉండాలని చెప్పిన
మహనీయుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ

ఆల్విన్‌కాలనీ: శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి ఆత్మ బలిదాన్ దివస్ సందర్భంగా ఆదివారం కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌బస్తీ దవాఖానా చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి రవికుమార్‌యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అఖండ భారతావనిలో ఒకే జెండా, ఒకే రాజ్యాంగం, ఒకే నినాదం ఉండాలని గట్టిగా చెప్పిన గొప్ప మహనీయుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. జాతీయ సమగ్రత, దేశ ప్రజల ఐక్యతను దెబ్బతీసే నాటి నెహ్రూ విధానాలను తీవ్రంగా శ్యామాప్రసాద్ ముఖర్జీ వ్యతిరేకించారని గుర్తు చేశారు. ప్రత్యేక సంస్థానంగా ఉన్న జమ్మూ కాశీర్‌కు వెళ్లాలంటే గతంలో అనుమతి తీసుకోవాల్సి వచ్చేదన్నారు. 370 ఆర్టికల్ విధానాన్ని వ్యతిరేకించి రద్దు అయ్యేందుకు పోరాడారన్నారు. శ్యామాప్రసాద్ ఆయన ప్రాణత్యాగం వృథా కాకుండా దేశ ప్రజల అభీష్టం మేరకు ప్రధాని నరేంద్రమోదీ 370 ఆర్టికల్ రద్దు చేశారని కొనియాడారు. దేశం మొత్తం ఒక్కటే భారత రాజ్యాంగం అమలు చేస్తున్న ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బీజేపీకి ఆకర్షితులైన యువకులు రవికుమార్‌యాదవ్ సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కో-కన్వీనర్ మణిభూషణ్, రామరాజు, డివిజన్ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నర్సింగ్ రావు, రాజిరెడ్డి, నర్సింగ్‌యాదవ్, కేశవ్, పర్వతాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో...

కూకట్‌పల్లి: శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం కూకట్‌పల్లిలోని బీజేపీ కార్యాలయంలో కూకట్‌పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కో-కన్వీనర్ ఏంజాల పద్మయ్య, కూకట్‌పల్లి అసెంబ్లీ కో కన్వీనర్ రవికుమార్‌గౌడ్, రాష్ట్ర నాయకురాలు సుధా రవి, బీజేపీ సీనియర్ నాయకులు, అన్ని డివిజన్‌ల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

సప్తగిరి కాలనీలో...

వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని సప్తగిరికాలనీ రోడ్ నం.1లో డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి భాస్కర్‌రెడ్డి నివాళులర్పించారు. సుదర్శన్, నరసింహాచారి, రవిశంకర్, ముత్యాలు పాల్గొన్నారు.


శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రవికుమార్ యాదవ్


సప్తగిరికాలనీలో నివాళులర్పిస్తున్న భాస్కర్‌రెడ్డి, తదితరులు